1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 145
మంగళవారం 02 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## కడుపు మంటతోనే రాష్ట్రంలో
# వైసీపీ కుట్రలు

**తుని సభలో చంద్రబాబు ఫైర్**
**తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ**
**వైసీపీని ఏకిపారేసిన సీఎం చంద్రబాబు**
**సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు**
**నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ**
**కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ**

2

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 01)**

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు.

**సుపరిపాలన చూసి ఓర్వలేకే కుతంత్రాలు**

గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి చంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తూయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు.

**విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి**

జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.

**సంక్షేమంతో పాటు ఉపాధి, అభివృద్ధి**

సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి.



## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 01)**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు.

ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు.లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్‌ను ఐటీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ▶మిగతా 2లో

## ఏపీలో జూన్ 7 నుంచి యోగా కార్యక్రమాలు.. వీడియోల కోసం ప్రత్యేక నంబర్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 01)**

ఏపీలో జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ సారి 2.5 లక్షల మందిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలని, వెస్ట్రన్ బైపాస్‌లో 25 వేల మందితో యోగా కార్యక్రమం చేపట్టాలని ▶మిగతా 2లో

## లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలా?: పవన్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 01)**

పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థలు సరిగా పన్నులు చెల్లించకపోవడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ అధికారులతో గ్రామపంచాయతీలకు రావాల్సిన పన్నులపై పవన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. లాభాలు సంపాదించే పరిశ్రమలు పంచాయతీలకు పన్నులు చెల్లించకపోతే ఎలా? అని అసహనం వ్యక్తం చేశారు. "గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టక పోవడ మేంటి?. ఆంధ్రా పేపర్ మిల్స్ రూ.19 కోట్లు బకాయిలు పెట్టింది. విద్యాసంస్థలకు సంబంధించి కూడా భారీగా బకాయిలు ఉన్నాయి. రాష్ట్రంలో పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయి. పేదలు, కులవృత్తులవారు, చిరుద్యోగులు కూడా పన్నులు చెల్లిస్తున్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు పన్నులు కట్టని విషయం ప్రజలకు తెలియదు. ▶మిగతా 2లో

## యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైకాపాకు కడుపు మంట: గొట్టిపాటి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 01)**

మెగా డీఎస్సీతో లక్షలమంది నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు ప్రసరించాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదరణ చూసి ఓర్వలేకే.. కూటమి ప్రభుత్వంపై వైకాపా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. "ఉద్యోగాల భర్తీని వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు పక్కన పెట్టింది. ▶మిగతా 2లో



## న్యాయమూర్తుల నియామకాలపై ఘర్షణ లేదు

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 01)**

సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాల విషయంలో న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థలో ఖాళీల భర్తీకి చక్కటి సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఆదివారం ఆయన పీటీఐతో మాట్లాడారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి వివిధ దేశాలు అనుసరిస్తున్న విధానాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అయితే ఈ అధ్యయనానికి ఎలాంటి అధికారిక కమిటీని ఏర్పాటు చేయలేదని, అనధికారికంగానే దీన్ని చేపట్టినట్లు వివరించారు. అందులో వెల్లడయ్యే అంశాల గురించి ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. కొలీజియం విధానానికి ప్రత్యామ్నాయాన్ని తీసుకొస్తారా అన్న ప్రశ్నకు ఆయన ఇలా స్పందించారు. న్యాయమూర్తుల నియామకాల్లో కొన్నిసార్లు కేంద్రం ▶మిగతా 2లో

## ఇకనైనా రెచ్చగొట్టే కుట్రలను వైకాపా వీడాలి: మంత్రి అనగాని సత్యప్రసాద్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 01)**

ఇకనైనా కుల, మత విధ్వంసాలు, రెచ్చగొట్టే కుట్రలను వైకాపా వీడాలని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.



నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ విగ్రహాన్ని వైకాపా వాళ్లే ధ్వంసం చేసి తెదేపాపై నెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి ▶మిగతా 2లో

## నిరుద్యోగులపై 'గొడ్డలిపార్టీ' కక్షసాధింపు: శాప్ ఛైర్మన్ రవినాయుడు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 01)**

జగన్‌కు ఓట్లు వేయలేదని నిరుద్యోగులపై 'గొడ్డలి పార్టీ' కక్ష సాధిస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు ధ్వజమెత్తారు. డీఎస్సీ పోస్టుల భర్తీలో స్పోర్ట్స్ కోటాలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న గొడ్డలిపార్టీ దానిని నిరూపించాలని సవాల్ విసిరారు. డీఎస్సీ జరగకుండా రూ. కోట్లు ఖర్చుపెట్టి కోర్టుల్లో తప్పుడు కేసులు వేశారని మండిపడ్డారు. తాజాగా యూనివర్సిటీ పోస్టుల భర్తీని, మరో డీఎస్సీని అడ్డుకోవడానికే తప్పుడు ▶మిగతా 2లో

## మధుర ఫలం రుచే రుచి



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 01)**

దేశంలో ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన మామిడి రకాలు ఉంటాయని, ఆంధ్రప్రదేశ్‌లో బంగినపల్లి, సువర్ణరేఖ లభ్యమవుతుంటాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'ఫలాల్లో రాజు.. మామిడి. ఈ వేసవి వచ్చిందంటే దాని గురించి చర్చ జరగని ఇల్లంటూ ఉండదేమో. ఒక్కో ప్రాంతంలో పండే మామిడిది ఒక్కో రుచి, సువాసన. మహారాష్ట్ర ఆల్ఫోన్సో, గుజరాత్ కేసరి, యూపీ దశహరీ, బెంగాల్ హిమసాగర్ వంటివి పేరెన్నికగన్నవి. ఇక దక్షిణాదికి ఎవరైనా వెళ్తే బంగినపల్లి, తోతాపురి, నీలమ్, మాల్గోవా ఊరిస్తాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో సువర్ణరేఖ దొరుకుతాయి. బిహార్‌లో జర్దాలు రకాలైతే అల్లంత దూరాన ఉంటుండగానే సువాసన తెలిసిపోతుంది. కాశీలోని లాంగ్రా రకం- పండిన తర్వాత కూడా ఆకుపచ్చగానే ఉంటాయి. ప్రాంతాలను బట్టి మామిడి ఆకారం, రుచి, రంగు మారుతాయి. ▶మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

**ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్**

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు.

**దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరించిన చంద్రబాబు**

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా నిలుస్తున్న 'బంగారు కుటుంబాల'తో ఆయన మాట్లాడారు. అనంతరం, వేదిక వద్దకు వచ్చిన ఓ దివ్యాంగ అభిమానిని ఆప్యాయంగా పలకరించి, అతని భుజంపై చేయి వేసి ఫొటో దిగారు. అతనికి ప్రభుత్వ సహకారం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులపై 'గొడ్డలిపార్టీ' కక్షసాధింపు: శాప్ ఛైర్మన్ రవినాయుడు

ఆరోపణలు చేస్తున్నారని రవినాయుడు స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఉద్యోగాల భర్తీ ఆగబోదని తెలిపారు. కష్టపడి డీఎస్సీ ఉద్యోగాలు సాధించిన వాళ్లు ఆందోళనలో ఉన్నారని చెప్పారు.

## మధుర ఫలం రుచే రుచి

వీటి ప్రస్థానం గ్రామాల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు విస్తరించింది' అని వివరించారు. ఆదివారం 'మన్ కీ బాత్' ద్వారా ఆయన మాట్లాడారు. దేశంలో ఎండలు మండిపోతున్న దృష్ట్యా బయటకు వెళ్లేవారు తప్పకుండా తగినంత నీరు తాగాలని సూచించారు. ఎండలపై ఆయా శాఖల మార్గదర్శకాలను పాటించాలని కోరారు.

**పరుగు వీరులతో ముచ్చట**

ఇటీవల రాంచీలో జరిగిన పరుగు పోటీల్లో జాతీయ రికార్డులు సాధించిన గురీందర్‌వీర్ సింగ్, అనిమేష్ కూజూర్‌లతో మోదీ మాట్లాడారు. జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ సమాఖ్య నిర్వహించిన పోటీలో విజేతలైన వీరి గురించి దేశమంతటా చర్చ జరుగుతోందని చెప్పారు. 100 మీటర్ల రేసులో రెండ్రోజుల వ్యవధిలో 3 రికార్డులు సాధించడం ప్రశంసనీయమన్నారు.

## ఇకనైనా రెచ్చగొట్టే కుట్రలను వైకాపా వీడాలి: మంత్రి అనగాని సత్యప్రసాద్

భద్రతలకు భంగం కలిగించేందుకు వైకాపా కుట్రలు చేస్తోందన్నారు. "దుష్ప్రచారాలు చేయడమే వైకాపా నాయకులు పనిగా పెట్టుకున్నారు. వైకాపా నాయకుడు జంబులయ్యనే విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తేలింది. ఈ కుట్రలో తెదేపాను ఇరికించేందుకు వైకాపా ప్రయత్నం చేసింది. విగ్రహ ధ్వంసం కుట్ర బహిర్గతం కాగానే దృష్టి మళ్లించడానికి డీఎస్సీపై పడ్డారు. యువత బాగుండకూడదనే కుట్రతో డీఎస్సీపై గొడ్డలి పార్టీ అసత్య ప్రచారం చేస్తోంది. అవినీతి బయటపడే కొద్దీ గొడ్డలి పార్టీ అధినేతలో ఆక్రోశం పెరుగుతోంది. ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా మీ అవినీతికి శిక్షలు తప్పవు. పీఏలు, పీఏల బినామీల బాగోతమంతా బయటపెట్టి తీరుతాం"అని మంత్రి అన్నారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

ఎయిర్‌ట్రంక్‌ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు.లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్‌ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

## ఏపీలో జూన్ 7 నుంచి యోగా కార్యక్రమాలు.. వీడియోల కోసం ప్రత్యేక నంబర్

నిర్ణయించినట్లు తెలిపారు. యోగా, నేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణ మాట్లాడుతూ.. యోగాపై ఐదు నిమిషాల నిడివితో 90 వీడియోలు రూపొందించినట్లు చెప్పారు. 21 వ్యాధులకు సంబంధించి 15 నిమిషాల నిడివితో యోగా వీడియోలు, యోగా పట్ల అపోహలు తొలగించేలా మరో 50 వీడియోలు సిద్ధం చేశామన్నారు. 81424 04888కు హాయ్ అని వాట్సప్‌లో మెసెజ్ పెడితే లింక్ వస్తుందని, అందులో నుంచి యోగా వీడియోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

## లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలా?: పవన్

రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పన్ను వసూళ్ల విషయంలో ముందుకెళ్లాలి. సీఎంతోపాటు మంత్రివర్గంతోనూ నేను మాట్లాడతా. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్ను వసూళ్ల కార్యాచరణ చేపట్టాలి"అని అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైకాపాకు కడుపు మంట: గొట్టిపాటి

అందువల్ల మెగా డీఎస్సీపై మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేదు. యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైకాపాకు కడుపుమంట. యువత భవిష్యత్‌పై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదు. అభివృద్ధి మా అజెండా.. దుష్ప్రచారం వైకాపా అజెండా" అని మంత్రి గొట్టిపాటి అన్నారు.

# న్యాయమూర్తుల నియామకాలపై ఘర్షణ లేదు

ప్రతిపాదించిన పేర్లను సుప్రీం కోర్టు కొలీజియం తిరస్కరించిన సందర్భాలున్నాయని, అదే విధంగా కొలీజియం ప్రతిపాదించిన పేర్లను కేంద్రం తిరస్కరించిందని గుర్తు చేశారు. ఆ జాబితాల్లోని వ్యక్తుల నేపథ్య చరిత్ర సక్రమంగా లేకపోవడంలాంటివి అందుకు కారణాలు కావొచ్చన్నారు. కొలీజియం వ్యవస్థను రద్దు చేస్తూ దాని స్థానంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసేందుకు వీలు కల్పించే బిల్లును గతంలో పార్లమెంటు ఆమోదించింది. అయితే సుప్రీం కోర్టు దాన్ని కొట్టివేసిన సంగతి తెలిసిందే. న్యాయ వ్యవస్థల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉండటంపై మేఘ్‌వాల్ స్పందిస్తూ.. వాటి పరిష్కారానికి తమ ప్రభుత్వం ప్రత్యామ్నాయ యంత్రాంగంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 1)**

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు చదవించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో వారికి కుందుడు గుమ్మ అనే ఆటను ఆడిపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు ఉలవపాడు గ్రామ నివాసి కసుకుర్తి తేజేశ్వర్ కందుకూరు వారు పిల్లలకు స్నాక్స్, శీతల పానీయాలు అందించి పిల్లల ప్రేమకు పాత్రులయ్యారు. వారికి గ్రంథ పాలకుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మొత్తం 37 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో అలగాయపాలెం టిడిపి నాయకులు







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 1)**

మండలంలోని కరేడు పంచాయతీ అలగాయపాలెంలో అలగాయపాలెం టిడిపి నాయకులు సోమవారం ఇంటింటికి తిరిగి పింఛను పంపిణీ చేపట్టారు. అలాగే చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను గుర్తు చేస్తూ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు చేసిన ఎన్నో మంచి పనులు గుర్తు చేస్తూ కార్యక్రమాన్ని సచివాలయం సిబ్బందితో కలిసి నిర్వహించారు.

## బీమ రక్షణ మనందరికి అవసరం

### ఎస్‌బిఐ ఒంగోలు రీజనల్ మేనేజర్ కె శ్రీధర్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు మెయిన్ బ్రాంచి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులకు బ్యాంక్ అందజేస్తున్న బీమా పథకంలో లబ్దిదారునికి జిల్లా విద్యాశాఖాధికారి సివి రేణుక, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ శ్రీధర్‌లు కోటి రూపాయల చెక్కును అందించారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మిట్టమీదపాలెంలోని ఎంపి ఎలిమెంటరీ పాఠశాలలో పనిచేసే సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయడు బుచ్చిరాజు శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన వేతన ఖాతా ఎస్‌బిఐలో ఉండటంతో బీమ పథకం కింద ఆయన కుటుంబానికి కోటి రూపాయల బీమా మొత్తం మంజూరైంది. ఈ కోటి రూపాయల బీమా చెక్కును బుచ్చిరాజు శ్రీనివాసరావు భార్య అరుణకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేతన ఖాతా కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామన్నారు. ఎటువంటి అదనపు రుసుములు, చెల్లింపులు లేకుండా ఈ సౌకర్యం అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఇది ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో భరోసాను ఇస్తుందన్నారు. అంతేకాకుండా వేతన ఖాతా కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా ఎన్నో అదనపు ప్రయోజనాలు కూడా బ్యాంక్ కల్పిస్తోందన్నారు. ఈ సౌకర్యాలను ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను కూడా ఖాతాదారులు వినియోగించుకోవాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల ద్వారా అతి తక్కువ ప్రీమియంతో బీమా రక్షణ కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి రేణుక మాట్లాడుతూ, అనుకోని పరిస్థితుల్లో కుటుంబ పెద్ద దూరం అయితే, ఆ కుటుంబం ఎంతో ఇబ్బంది పడుతుందన్నారు. అయితే, బీమా రక్షణ ఉంటే ఆర్థికంగా అది వారికి ఎంతో భరోసా ఇస్తుందన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేతన ఖాతా కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఈ కోటి రూపాయల బీమా పథకం ఎంతో ఉపయోకరమైందన్నారు. ఎస్.బి.ఐ. మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ డి.దంతేశ్వరరావు మాట్లాడుతూ, తమ బ్యాంకు ద్వారా వేతన ఖాతా కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వేదం రాజేష్ బాబు, కె జానకి రామయ్య, కోటేష్ బాబు, సంతనూతలపాడు మండల విద్యాశాఖాధికారులు డి వెంకారెడ్డి, ఎన్ షణ్ముఖ కుమార్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# రూ.5 లక్షల విలువైన 8 మోటార్ సైకిళ్లను స్వాధీనం

### బైక్ దొంగతనాలకు పాల్పడిన నిందితులు అరెస్టు

### కేసును ఛేదించుటలో ప్రతిభ చూపిన పోలీసులు


### సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)**

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న మార్టూరుకు చెందిన ఇద్దరు నిందితులు షేక్ మస్తాన్, షేక్ బాజీ లను అరెస్టు చేసినట్లు ఒంగోలు రూరల్ సిఐ ఎం శేషగిరిరావు తెలిపారు. సోమవారం సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు ఆయన వెల్లడించారు. జె పంగులూరు గ్రామానికి చెందిన మొగిలి రవి జనవరి 12న బేల్దారు పనుల నిమిత్తం సంతనూతలపాడుకు వచ్చాడు. ఈ క్రమంలో నూతలపాడు బస్టాండ్ సెంటర్‌లో టిఫిన్ తినేందుకు వెళ్ళి తిరిగి వచ్చి చూడగా తన మోటారు బైకు అపహరణకు గురైందని గుర్తించారు. మే 28న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు సూచనలతో సంతనూతలపాడు ఎస్ఐ అజయ్‌బాబు సిబ్బందితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసి కెమెరాల సహాయంతో నిందితులను గుర్తించారు. వీరిద్దరు జల్సాలకు అలవాటు పడి మోటారుబైక్‌లను దొంగలిస్తుంటారని గుర్తించారు. దొంగలించిన వాహనంతో ఒంగోలులో అనుమానంగా తిరుగుతుండగా ఐటి కోర్ సిబ్బంది సిసి కెమెరాల సహాయంతో నిందితులను గుర్తించి సంతనూతలపాడు ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ హుటాహుటిన వారి వాహనాలను పట్టుకోవడంతో పాటు వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువ గల 8 మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నారన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను, ఐటీ కోర్ టీం సిబ్బంది, ఏఎస్ఐ మాల కొండయ్య, హెచ్‌సీ సిహెచ్ ఉదయ్ కుమార్, హెచ్‌సీ షరీఫుద్దీన్, జి పవన్ కుమార్, వి జాన్ వెస్లీ, శేషగిరి, నారాయణరెడ్డి, శివకృష్ణలను ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.










ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

02.06.26 మంగళవారం




# మొదటి రోజే వంద శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోండి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 1)

జిల్లాలో మొదటి రోజే వంద శాతం పింఛన్ల పంపిణీకి అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని పీఎస్ కాలనీ బిలాల్ మసీదు వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ▶4లో



# ఖరీఫ్ సీజన్‌కి విత్తనాలు ఎరువులు కొరతరానివ్వొద్దు

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 1)

జిల్లాలో ఖరీఫ్ సీజన్ కి విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అధికారులతో ▶4లో



# పారిశ్రామికవేత్తలతో గెట్ టు గెదర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- అనంతరం పెట్టుబడిదారులతో సదస్సు -జిల్లాకు పెట్టుబడులే లక్ష్యంగా అడుగులు
- డీఐఈపీసీ సమావేశంలో నిర్ణయం - అర్హులకు రూ.29.17 కోట్లు మంజూరు

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)

జిల్లాకు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా కలెక్టర్ పి రాజాబాబు చర్యలు వేగవంతం చేశారు. త్వరలోనే పెట్టుబడిదారులతో ప్రత్యేక సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి ముందుగా పారిశ్రామికవేత్తలతో గెట్ టు గెదర్ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పెట్టుబడులు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో ఆయన పునరుద్ఘాటించారు. మైక్రో ఫైనాన్సుతో మైక్రో బిజినెస్ చేసేలా స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన ప్రోత్సాహం, ఆర్థిక సహాయం వేగంగా అందేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. రుణాల మంజూరులో జాప్యం ఉండకూడదని అన్నారు. ఈ దిశగా డిఆర్డిఏ, (తరువాయి 4లో...)

# ఉనికి కోసమే డీఎస్సీ పై గొడ్డలి పార్టీ నీచ రాజకీయాలు

## అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 16,347 టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశాం
## ప్రజల్లో కూటమి ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ అసత్య ఆరోపణలు
## మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, జూన్ 1)

ప్రజల్లో ఉనికి కోసమే డీఎస్సీపై గొడ్డలి పార్టీ నీచ రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. (తరువాయి 4లో...)




# టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన యువనాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 1)

పొదిలి పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెగా ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు, యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత క్రీడాకారులతో కరచాలనం చేసి వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా యువతకు ఎంతో అవసరమన్నారు. క్రీడలు ఆడడం ద్వారా శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన పార్టీ నాయకులకు ఆయన





# పేద పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం

## అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సంక్షేమం అందిస్తున్నాం

## రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 1)



పేదల పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ఒంగోలులోని సంతపేటలో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఎస్సి గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు మంత్రి డిఎస్ బీవీ స్వామి పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని మంత్రి అధికారులకు సూచించారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం అజయ్ కింద రూ.86 కోట్లతో రాష్ట్రంలో 25 నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నాం. సాస్కి నిధులు రూ.200 కోట్లతో రాష్ట్రంలోని హాస్టళ్లకు మరమ్మతులు, అదనపు భవనాలు నిర్మిస్తున్నాం. రూ.143 కోట్లతో 700 హాస్టళ్లకి మరమ్మతులు చేశాం. రూ.58 కోట్లతో అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి

# న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తేళ్ల కస్తూరి

(షణ్ముఖ వెలుగు, విజయవాడ, జూన్ 1)

ఒంగోలు జోన్ 3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న తేళ్ల కస్తూరి సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనరేట్‌లో న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారిణిగా బాధ్యతలు స్వీకరించారు. సమాచార పౌర సంబంధాల శాఖలో అడిషనల్ డైరెక్టర్ (ఇంచార్జ్) గా విధులు నిర్వహిస్తూ, న్యూఢిల్లీలోని ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఏపీఐసీ) ప్రత్యేక అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన పి కిరణ్ కుమార్ మే 31వ తేదీన పదవీ విరమణ చేసిన నేపథ్యంలో తేళ్ల కస్తూరికి బాధ్యతలు అప్పగించారు. ఏపీఐసీ ప్రత్యేక అధికారి బాధ్యతలను ఒంగోలు జోన్ 3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు తేళ్ల కస్తూరికి అప్పగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె ఎస్ విశ్వనాథన్ ఉత్తర్వులు జారీ చేశారు. సంచాలకులు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు తేళ్ల కస్తూరి న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారి, ఒంగోలు జోన్ 3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు తేళ్ల కస్తూరి సమాచార పౌర సంబంధాల సంచాలకులు కేఎస్ విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



### సుదీర్ఘ సర్వీస్ ప్రస్థానం....

2001 డిసెంబర్ 21న ఏపీపీఎస్సీ ద్వారా జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారిణిగా రంగారెడ్డి జిల్లాలో నియమితులయ్యారు. తదనంతరం డి వి ఆర్ ఓ గా హైదరాబాద్ జిల్లాలో ఆమె సేవలు అందించారు. అసిస్టెంట్ డైరెక్టర్ గా ప్రమోషన్ పొందిన తర్వాత ఉమ్మడి రాష్ట్ర పబ్లిసిటీ సెల్ లో బాధ్యతలు నిర్వహించి, ప్రథమ మహిళా సిపిఆర్ఓ టూ డిజిపిగా బాధ్యతలు చేపట్టి, సమర్థవంతంగా పనిచేశారు. అనంతరం ప్రథమ మహిళ సిపిఆర్ఓ టూ జిహెచ్ఎంసి గా సేవలందించారు. రాష్ట్ర విభజన అనంతరం తన మాతృ సంస్థ అయిన సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. డిప్యూటీ డైరెక్టర్‌గా పబ్లిసిటీ సెల్ నందు, మీడియా రిలేషన్స్‌లో, అడ్మినిస్ట్రేషన్‌లో తన సేవలు అందించారు. 2019 లో జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి పొంది అడ్మినిస్ట్రేషన్, మీడియా రిలేషన్స్, ప్రింట్ మీడియా అడ్వర్టైజ్మెంట్ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆర్జేడి 3 ఒంగోలుగా గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, మార్కాపురం జిల్లాల బాధ్యతలను ఆమె నిర్వహిస్తున్నారు. తన 24 ఏళ్ల సర్వీస్‌లో దాదాపు 25 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల దగ్గర పనిచేసి ఉత్తమ అధికారిణిగా మన్ననలు పొందారు.



4

# వ్యక్తి పై హత్యాయత్నం







**(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 1)**

నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంకు చెందిన కోమటిగుంట్ల శివ మండలంలోని కోడిగింపుల గ్రామంలోని తన బావ వద్దకు వచ్చాడు. వారిద్దరూ కలిసి వేంపాడు గ్రామంలో జరుగుతున్న తిరునాళకు వెళ్ళేందుకు మోటార్ సైకిల్ పై బయలుదేరి వెళ్ళారు. మార్గమధ్యంలో మే 30వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో బొట్లగూడూరు గ్రామం జంక్షన్ కు చేరుకొని అక్కడ మజ్జిగ తాగి వెళదామని కూల్ డ్రింక్ షాప్ వద్ద ఆగి నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో అక్కడ పామూరు మండలం, బొట్లగూడూరుకు చెందిన ఆవుల వేణుగోపాల్ అనే వ్యక్తి వీరిని చూసి, వీరి వద్దకి వచ్చి అరుస్తూ కేకలు వేస్తూ ఉండగా శివ అను వ్యక్తి ఎందుకు మమ్మల్ని చూసి అరుస్తున్నావు అని ఆడగగా శివ మీద గొడవ పెట్టుకొని, తిట్టి, చేతితో కొట్టగా శివ వేణు గోపాల్‌ని పక్కకి నెట్టగా, అందుకు వేణు గోపాల్, శివని నన్నే పక్కకి నెడతావ, ఎంత ధైర్యం నిన్ను ఎలాగైనా చంపుతానని వేణు గోపాల్ అటు, ఇటు వెతుకుతూ దగ్గరలో కొబ్బరి బొండాలు కొట్టే కత్తి తీసుకొని శివను గొంతు మీద నరకగా బలమైన రక్త గాయమైంది. అంతట శివను పామూరు ప్రభుత్వ హాస్పిటల్ నందు ప్రధమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స నిమిత్తం కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు నందు చేర్చారు. అనంతరం ఫిర్యాది యొక్క స్టేట్మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గోగినేని రామారావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)**

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశాల మేరకు స్థానిక 35వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వికలాంగులు మరియు నిరుపేద కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వృద్ధాప్య పెన్షన్ రూ.4,000, వికలాంగుల పెన్షన్ రూ.6,000, పూర్తిగా మంచానికే పరిమితమైన బాధితులకు రూ.15,000 అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. పెన్షన్ లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వల్ల తమ వైద్య ఖర్చులు, నిత్యావసర అవసరాలు తీర్చుకోవడంలో ఎంతో ఉపశమనం కలుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌ఎస్ సభ్యులు మారెళ్ళ నాగలింగేశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకులు నాగేశ్వర్ నాయక్, వార్డు డిజిటల్ అసిస్టెంట్ సింగమనేని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి కుటుంబానికి భరోసా అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గోగినేని రామారావు పేర్కొన్నారు.

# టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన యువనాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి



ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.







# ఖరీఫ్ సీజన్‌కి విత్తనాలు ఎరువులు కొరతరానివ్వొద్దు



ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షాపుల్లో విత్తనాలు, ఎరువులు ఎంత స్టాక్ ఉన్నాయి..రైతులకు ఇంకా ఎంత కావాలి అంటే అంశాలను పరిశీలన చేయాలన్నారు. వీటిని ఎక్కువ రేట్లు అమ్మడం, బ్లాక్ మార్కెట్ తరలించే వారి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రైతులకు ఫార్మర్ యాప్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 1.52 లక్షల మంది రైతులకు ఈ యాప్ ను డౌన్లోడ్ చేపించాలన్నారు. మట్టి నమూనా పరీక్షలు ఇప్పటికి పూర్తి చేయక పోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఉద్యాన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. పంటల సాగు, లాభాలు వంటి అంశాలను రైతులకు పూర్తిస్థాయిలో తెలియజేయాలన్నారు. పట్టు పెంపకం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయశాఖ అధికారి బాలాజీ నాయక్, ఉద్యానశాఖ అధికారి రమేష్, మైక్రో ఇరిగేషన్ పీడీ జెనెమ్మ, జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మొదటి రోజే వంద శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోండి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలో 1.46 లక్షల మందికి ఈ పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. పంపిణీలో నిర్లక్ష్యం వహించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, ఇతర మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలతో గెట్ టు గెదర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



మెప్మా, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వారి ఉత్పత్తులకు ముందుగా స్థానిక క్లస్టర్ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలన్నారు. ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలను కూడా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, రాయితీలను వారికి వివరించాలని ఆదేశించారు. ఈ దిశగా ముందుకు వచ్చిన ఔత్సాహికుల దరఖాస్తులను సత్వరం క్లియర్ చేయాలన్నారు. కాగా 120 క్లెయిమ్‌లకు ప్రభుత్వం తరఫున రూ.29.17 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని ఈ సందర్భంగా మంజూరు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ పిడి నారాయణ, మెప్మా పిడి విజయలక్ష్మి, ఎల్‌డిఎం రమేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, ఒంగోలు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం రవికుమార్, ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఫ్యాప్సీయా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె సుబ్బారావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచితంగా డీపీఆర్ : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహాయం అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని ఫిన్వాయిస్ సంస్థ ఫౌండర్ డైరెక్టర్ ఫర్వేజ్ మహమ్మద్ తెలిపారు. తమ సేవలను వినియోగించుకునేందుకు ఎంప్యానల్డ్ జాబితాలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చేర్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు తమ సంస్థ తరఫున తయారు చేసిన డీపీఆర్‌ల వివరాలను ఈ సమావేశంలో కలెక్టరుకు ఆయన వివరించారు.

# ఉనికి కోసమే డీఎస్సీ పై గొడ్డలి పార్టీ నీచ రాజకీయాలు

సోమవారం సింగరాయకొండ మండలం సోమరాజుపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంత్రి స్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రజల్లో ఉనికి కోసమే డీఎస్సీ పై గొడ్డలి పార్టీ నీచ రాజకీయాలు చేస్తోంది. అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 16,347 టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రజల్లో కూటమి ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ అసత్య ఆరోపణలు చేస్తోంది. మీ రాజకీయ లబ్దికోసం కష్టపడి ఉద్యోగాలు సాధించిన టీచర్లను అవమానిస్తారా? కరప్షన్‌కి కజిన్ బ్రదర్ జగన్, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అండ్ కో చేయని అక్రమాలు లేవు. తవ్వే కొద్దీ జగన్ పిఏ వేల కోట్ల అక్రమాలు, అవినీతి సంపాదన వెలుగులోకి వస్తున్నాయి. గత ఐదేళ్లు పాలన గాలికొదిలి దోచుకోవడం,దాచుకోవడమే పనిగా గొడ్డలి పార్టీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని మంత్రి స్వామి అన్నారు.

# పేద పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం





గృహాల్లో అదనపు మరుగుదొడ్లు నిర్మించాం. ఒంగోలులో దివ్యాంగ విద్యార్థుల కోసం రూ.3 కోట్లతో ప్రత్యేకంగా హాస్టల్ నిర్మిస్తున్నాం. త్వరలోనే మెస్ చార్జీలు పెంచుతాం. తిరుపతి, విజయవాడ, విశాఖ స్టడీ సర్కిళ్లలో 450 మందికి ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇస్తున్నాం. వీటితో పాటు ఒంగోలు, అమలాపురంలో నూతనంగా స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తాం. 250 మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టాం. పేదల పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు అవ్వాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం. అందుకనుగుణంగా ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లను 3 నుంచి 13కి పెంచాం. మరో 12 పెంచి 25 జిల్లాలకు 25 ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



## ఇంచార్జ్ ఆర్డీవో గా బాధ్యతలు చేపట్టిన ఎమ్ వి.సత్యనారాయణ

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 1)**
జిల్లా కేంద్రమైన మార్కాపురం ఇంచార్జ్ ఆర్డిఓ గా ఎమ్. వి సత్యనారాయణ సోమవారం ఉదయం ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్డీవో గా పనిచేసిన పెంచల ప్రభాకర్ ను రాష్ట్ర సచివాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

# నిర్ణీత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 1)**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఆర్జీలను ప్రజల సంతృప్తే లక్ష్యంగా నిర్ణీత గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యు అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎస్డీసీ మాధురి, డిపిఓ వెంకటేశ్వరరావులతో కలసి పాల్గొని ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. అధికారి తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు మళ్లీ రీ ఓపెన్ కాకూడదని, ఒకవేళ ఏదైనా అర్జీ రీ ఓపెన్ అయితే సంబంధిత అధికారి తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు పిజిఆర్ఎస్ వినతులను అన్ లైను ద్వారా వెబ్‌సైట్‌లో చెక్ చేసుకొని, అధికారులు వినతులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 256 అర్జీలు వచ్చాయి. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఇందులో పాల్గొన్నారు.







## నాగార్జునసాగర్ నుంచి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించుకునేలా నిరంతర పర్యవేక్షణ అవసరం





**(షణ్ముఖ వెలుగు, జె పంగులూరు, జూన్ 1)**
నాగార్జునసాగర్ నుంచి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించుకునేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ .పి. రాజాబాబు చెప్పారు. సోమవారం ఆయన జె పంగులూరు మండలంలోని రామకూరు గ్రామంలో నాగార్జునసాగర్ నుంచి వస్తున్న కాలువను పరిశీలించారు. ఎగువ నుంచి వస్తున్న నీటి పరిమాణము, ప్రవాహ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్రాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గంలోని అన్ని చెరువులను పూర్తిస్థాయి నింపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఉండాలని, పొరుగు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలోకి వస్తున్న నీటి పరిమాణం, చెరువులను నింపుతున్న వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ సతీష్, ఇతర అధికారులు ఉన్నారు.

## మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జూన్ 1 నుండి 30 వరకు దోమల నియంత్రణ




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)**
జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రజాదర్బార్ హాలు నందు సోమవారం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశాల మేరకు గోడ పత్రికను ఆవిష్కరించారు. మాసోత్సవాల గురించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా లక్షణాలు సాధారణంగా దోమ కాటు తర్వాత 7 నుండి 15 రోజుల తర్వాత ప్రారంభమవుతాయన్నారు. మలేరియా యొక్క లక్షణాలు, మలేరియా యొక్క అత్యంత గుర్తించదగిన లక్షణం జ్వరం, ఇది తరచుగా చలి, చెమటతో కూడిన విలక్షణమైన 'మలేరియా ప్యారొక్సిస్మ్' లేదా 'ఫీవర్ పీరియడ్స్' ద్వారా వర్గీకరించబడుతుంది. ఈ దశలను ఈ క్రింద క్లుప్తంగా వివరించడం జరిగింది. మొదట వ్యక్తి తీవ్రమైన చలి, వణుకుతో బాధపడతాడు. ఈ దశ 15 నిమిషాల నుండి ఒక గంట వరకు ఉంటుంది. ప్రతి సంవత్సరం జూన్ నెలను మలేరియా వ్యతిరేక మాసోత్సవాలుగా నిర్వహిస్తారు. వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో దోమల పెరుగుదల ఎక్కువగా ఉండటం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. మలేరియా అనేది సోకిన ఆడ అనోఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపించే వ్యాధి. ఇది జ్వరం, వణుకు, తలనొప్పి, చెమటలు, నీరసం వంటి లక్షణాలను కలిగిస్తుంది. మలేరియా లక్షణాలు తరచుగా జ్వరం రావడం, వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, అధిక చెమటలు, బలహీనత, నీరసం ఉంటాయన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు, సబ్ యూనిట్ ఆఫీసర్స్ పాతూరి శ్రీనివాసులు, సాగర్, అర్జునరావు, హెల్త్ అసిస్టెంట్స్, పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 1)**
ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంగా మీ కోసం కార్యక్రమం మార్కాపురం జిల్లా పోలీసులు సోమవారం నిర్వహించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 27 ఫిర్యాదులు జిల్లా ప్రజల నుంచి అందాయి. వివిధ రకాల ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలనే లక్ష్యంతో మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వ్రాతపూర్వక వినతులను స్వీకరించిన పోలీసు అధికారులు, వారితో నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, చట్టబద్ధమైన పరిధిలో విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే పంపించి, ప్రతి ఫిర్యాదిపై త్వరితగతిన విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా అలసత్వానికి తావు లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలన్నారు.జిల్లా పోలీసు కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరుకాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీసు స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు లేదా సబ్ డివిజన్ కార్యాలయాల ద్వారా కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, సివిల్ తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాలు, చీటింగ్, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సిఐ అల్తాఫ్ హుస్సేన్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, పామూరు సీఐ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 213 అర్జీలు







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 1)**
మార్కాపురం కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 213 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 135, ఇతర సమస్యల పై 78 అర్జీలు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ అర్జీదారులకు స్పష్టమైన ఎండార్స్ మెంట్ ఇవ్వాలన్నారు. ఇటీవల జరుగుతున్న నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్‌లలో వచ్చిన అర్జీలను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. వచ్చే కార్యక్రమం నాటికి వీటిపై పూర్తిస్థాయిలో యాక్షన్ రిపోర్ట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డీఆర్వో శివరామిరెడ్డి, కనిగిరి ఆర్డీవో అజయ్ కుమార్, జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, డీఎల్‌డీవో బాలునాయక్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్ 2026 ఫలితాల్లో సరస్వతి విద్యార్థుల ప్రతిభ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)**
జేఈఈ అడ్వాన్స్ 2026 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మెన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. 13మంది విద్యార్థులు ఐఐటీకి అర్హత సాధించినట్లు వివరించారు. ఒంగోలులోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల క్యాంపస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రమణారెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్గులకు తమ విద్యా సంస్థల డైరెక్టర్లు గణేష్ రెడ్డి, గంగాశంకరరెడ్డిలు ఐఐటీ పట్ల అవగాహన కలిగించి అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేశారన్నారు. మంచి ఫ్యాకల్టీని తెప్పించి విద్యార్థుల నుండి మంచి ఫలితాలు రాబట్టారన్నారు. భవిష్యత్ లో ఇంకా అనేక అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని రమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



## పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)
రాష్ట్ర ప్రభుత్వ సామాజిక భద్రత కింద వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర పింఛన్ల దారులకు జూన్ నెలలో అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పాల్గొన్నారు. సోమవారం ఒంగోలు నగరంలోని ఏనుగుల చెట్టు వీధిలో మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ రాజాబాబు, లబ్దిదారులకు పింఛన్ సొమ్ము అందజేసారు. కలెక్టర్ వెంట ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకట క్రిష్ణయ్య, వార్డు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 15వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేసిన టీడీపీ డివిజన్ నాయకులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)
ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఆదేశాల మేరకు సోమవారం 15వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళ, ఇతర పింఛన్లకు అర్హులైన పెన్షన్ దారులకు ఎన్టీఆర్ భరోసా పించన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్లస్టర్ ఇంచార్జ్ పాలూరి వెంకటేశ్వరరెడ్డి ,కో క్లస్టర్ కన్వీనర్ పీఎస్ బాబు వీరితో పాటు నగర కమిటీ సభ్యులు యాలటూరి రవి, నియోజకవర్గ కమిటీ సభ్యులు యాసరపు ఏడుకొండలు, డివిజన్ బూత్ కన్వీనర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగు మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మా స్టలం కబ్జా చేసి మమ్మల్ని బెదిరిస్తున్నారు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)
మా తాతల నాటి భూమిని కబ్జా చేసి చివరికి సంతకం పెట్టమని మమ్మల్నే చంపుతామని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఒంగోలు నగరంలోని రాజీవ్ నగర్ కి చెందిన కోట వంశీయులు కోట సుబ్బారావు, కోట కోటేశ్వరరావు, కోట రాంబాబు, మీడియా ముందు వాపోయారు. ఒంగోలు నగరంలోని మామిడిపాలెం చెరువు కట్ట సమీపంలోని రాజీవ్ నగర్లో సర్వే నెంబర్ 307 లో వీరికి ఎకరా యాభై ఆరు సెంట్లు స్థలం ఉండగా ఇందులో ఇరవైఏడు సెంట్ల భూమిని గతంలో అమ్ముకోవడం జరిగింది. అయితే మిగిలిన ఈ భూమిని ఒంగోలు నగరానికి చెందిన అప్పికట్ల శ్రీనివాసరావు కబ్జా చేసి నగరానికి చెందిన మరొకరికి అమ్మడం జరిగిందని వారు తెలిపారు. గ్రీవెన్స్ లో కూడా అర్జీ ఇవ్వటం జరిగిందని వారు తెలిపారు తమ ఈ భూమికి కొలతలు వేసి ఇవ్వమని చలానా కట్టి ఒంగోలు నగర సర్వే డిపార్ట్మెంట్ వారికి ఇచ్చినా మా భూమికి కొలతలు వేయకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు అధికారులు న్యాయం చేయాలని కోరారు.

# 50ఏళ్ళకే ఎస్సీ, ఎస్టీ బీసీలకు పెన్షన్ ఇవ్వాలి

### ఎస్సీ, ఎస్టీ బీసీలకు కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ఇవ్వాలి
### దళితులకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలి
### కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన దళిత నేత నీలం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)
ఎస్సీ, ఎస్టీ బీసీలకు 50 ఏళ్లకే ఇస్తామన్న వృద్ధాప్య పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఎస్సీ ఎస్టీ, బీసీలకు సబ్సిడీ రుణాల బడ్జెట్ విడుదల చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయం వద్ద కుటమి ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని నిరసన కార్యక్రమం చేశారు .ఈ కార్యక్రమంలో నీలం నాగేంద్రావు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు క్రింద ఉమ్మడి ప్రకాశం జిల్లాకు 9200 కోట్లు తెప్పించినట్లే ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్లకు సబ్సిడీ రుణాలు నిధులు కూడా విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను తిరిగి తాము అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీలకు రెండేళ్లుగా కుచ్చుటోపి పెట్టిందన్నారు. మొదటి సంవత్సరం 24-25 కు గాను మాల మాదిగ ఎస్టీ బీసీ ముస్లిం కార్పొరేషన్లకు హట్టహాసంగా యాక్షన్ ప్లాన్ విడుదల చేశారే గాని నిధులు ఇవ్వలేదన్నారు. మరలా రెండవ సంవత్సరం 25-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీల రుణ అర్హత 50 ఏళ్లకు తగ్గించి ఎస్సీ, ఎస్టీ, బీసీలు పెట్టుకోలేని యూనిట్లను యాక్షన్ ప్లాన్‌లో పెట్టి జిల్లా కలెక్టరేట్ల వద్ద బాహుబలి చెట్టింగ్లు వేసి మంత్రులు, ఎమ్మెల్యేలు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్ధారకు లాగా ఊగిపోయేరే గాని నేటికీ రూపాయి సబ్సిడీ విడుదల రాలేదన్నారు. అమరావతి అద్దాలకు 2500 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీలకు రెండేళ్లయిన ఒక్క రూపాయి సబ్సిడీ రుణం కూడా విడుదల చేయలేదన్నారు. ముచ్చటగా మూడవ సంవత్సరం ఉన్నతి అనే పథకం ద్వారా పొదుపు గ్రూపు మహిళలకు కేవలం ఎస్సీ ఎస్టీలకు నూటికి పది శాతం గ్రూపులకు లక్ష రూపాయల రుణం 50 శాతం సబ్సిడీగా వెలుగు పథకం ద్వారా విడుదల చేస్తామని దళితుల జీవితాలలో చీకట్లు తొలగిస్తామని కూటమి ప్రభుత్వం కోతల కోస్తుం దన్నారు. రాజధాని పేరట అమరావతికి మరియు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి విదేశీ బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వము నుండి లక్షల కోట్లు అప్పులు తెచ్చుకుంటున్న చంద్రబాబు అమరావతి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఈ రెండేళ్లలో సబ్సిడీ రుణాలు కూడా ఇవ్వక అరుంధతి నక్షత్రాన్ని చూపిస్తుందన్నారు. అభివృద్ధి పేరట ఆదాని అంబానీ కంపెనీలకు




ఎకరా 99 రూపాయలకు ఇస్తే తప్పేమిటంటే, మంత్రి లోకేష్ దళితులకు ఇళ్ల స్థలాలు, స్మశాన భూములు ఎందుకు కేటాయించటం లేదన్నారు. భ్రమరావతి ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు తెచ్చుకుంటున్న కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు మాత్రం బ్యాంకులతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పలు పథకాలకు గ్యారెంటీ రాష్ట్రానికి ఎందుకు తీసుకుని రావడం లేదన్నారు. సంక్షేమం అంటే కేవలం వృద్ధాప్య వితంతు,వికలాంగ పెన్షన్లు ఇస్తూ నెల నెల ఒకటవ తేదీన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఫోటోలు దిగుతూ వాలంటీర్లు పంచే పెన్షన్లను కూటమి ప్రభుత్వం ఫోటో ప్రభుత్వం ప్రభుత్వ నిధులతో పబ్లిసిటీ చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు విడుదల చేయాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి మాదిగ, పరిరక్షణ సమితి కన్వీనర్ పట్టరా బంగారం, బొమ్మలు వంశీ, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, యానాది పరిరక్షణ సమితి ప్రతినిధులు నాగమణి, అంకం కిరణ్, తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి




### ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు
### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 78 ఫిర్యాదులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)
ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల వ్రాతపూర్వక వినతులను జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులకు సంబంధించి ఫిర్యాదుదారుల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, తక్షణమే విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులో వాటిని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరిగేలా స్పందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర ప్రత్యేక అవసరాలు ఉన్న ఫిర్యాదుదారుల పట్ల సున్నితంగా వ్యవహరించి, వారి వినతులను ప్రాధాన్యతతో పరిశీలించి, చట్టపరమైన పరిధిలో త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేధింపులు, మోసాలు, చీటింగ్ మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ హజరత్తయ్య, కందుకూరు సీఐ అన్వర్ బాషా, అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 1)
రాచర్ల పట్టణంలో రాములవారి వీధి నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి స్వయంగా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నెలలో ఒకటో తారీకున ఖచ్చితంగా ప్రతి ఇంటికి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం రాచర్ల పంచాయతీలో మొత్తం 627 పెన్షన్ లకు రూ.28,12,500లు పంపిణీ చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు కానీ, ప్రభుత్వ ఉద్యోగస్తులకు కానీ నెలకు జీతము సరిగా ఇచ్చే వారు కాదని, కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి, పెన్షన్ దారులకు ఒకటవ తారీకు ఉదయాన్నే వారి ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇది కూటమి ప్రభుత్వం పేద ప్రజల పట్ల ఉన్న శ్రద్ధ అని తెలిపారు. కూటమి ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిద్దలూరు నియోజకవర్గానికి 38,454 పింఛన్లకు గాను రూ.17,21,55 ,000లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒక సంవత్సరానికి 33,000 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పెన్షన్ ఇవ్వడం జరగడం లేదన్నారు. ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కూటమి ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్క పేద ప్రజలకి అందించడం జరిగిందని, గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేశారని, కానీ నేడు కూటమి ప్రభుత్వం వాటన్నిటినీ అధిగమించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల రెవెన్యూ అధికారి ఎల్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్, ప్రధాన కార్యదర్శి యాసం లక్ష్మిరెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, సిరిగిరి వేంకటపతి, భూపని కాసయ్య, దప్పిలి కాసిరెడ్డి, ముత్తుముల శేఖర్‌రెడ్డి, పార్లమెంట్ ట్రెజరర్ అంబవరం శ్రీనివాస్‌రెడ్డి, భవనం పుల్లారెడ్డి, నల్లబోతుల సంజయ్, తలపాటి దివాకర్, శ్రీను, కత్తి అన్నాజీరావ్, గుర్రం దానియేలు, పాపిశెట్టి శ్రీనివాసులు, ఆది నారాయణరెడ్డి, కళ్యాణరెడ్డి, సాయి, సయ్యద్ మియా, స్థానిక వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు నూతన పింఛన్లు మంజూరు చేయకపోవటం శోచనీయం

### కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 1)
నూతన పెంక్షన్స్ పొందుటకు అర్హతలు కలిగి ఉన్నప్పటికి తమకు నూతన పెంక్షన్స్ మంజూరు చేయడం లేదని పెంక్షన్స్ మాకు జీవనాధారమని ప్రజలు వాపోతున్నారని కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో ఆయన పర్యటించగా నూతన పెంక్షన్స్ పొందుటకు అర్హులైన లబ్దిదారులు పెంక్షన్స్ లేవని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే ఇంటివద్దే ఆత్మగౌరవంతో పింఛన్లు అవ్వాతాతలు, దివ్యాంగులను పెంక్షన్స్ పంపిణి చేయడం జరిగేది.ప్రస్తుతం అర్హత కలిగి ఉన్నప్పటికి లబ్దిదారులకు నూతన పెన్షన్స్ మంజూరు చేయక పోవడం చాలా బాధాకరమణి ఆవేదన వ్యక్త పర్చారన్నారు.పెంక్షన్స్ డబ్బులే తమకు జీవనాధారమని, నెలంతా వాటితోటే గడపాలని, మందులకూ అవే దిక్కని వృద్ధులు ఆక్రోశిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అవ్వాతాతలకు గుడ్ మార్నింగ్ చెప్పి మరీ ఇంటి వద్దే పెన్షన్లు పంపిణి చేయడం జరిగిందని, ప్రస్తుతం వ్యవస్థను కక్షపూరితంగా పూర్తిగా నీరుగార్చిందన్నారు. సామాజిక పెన్షన్లకు వైకల్య శాతం పేరుతో దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం ఎగరగొట్టిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. దేశంలో ఏ పాలకుడూ ఇంత నిర్దయగా వ్యవహరించిన దాఖలాలు లేవని దివ్యాంగులు ఆర్తనాదాలు చేసినా కూటమి సర్కారు పట్టించుకోలేదనారు.ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెంక్షన్స్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# దన్నాసి శోభన్ బాబుకి బహుజన టీచర్స్ అసోసియేషన్ ఘన నివాళి







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 1)

స్వర్గీయ దన్నాసి శోభన్ బాబు సంస్మరణ సభను స్థానిక గవర్నమెంట్ హై స్కూల్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించి ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సభకు ఉలవపాడు బిటిఏ జనరల్ సెక్రెటరీ దన్నాసి మురళీమోహన్ సభా పరిచయం చేయగా మండల అధ్యక్షులు పున్నెపల్లి శ్రీను అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉలవపాడు మండల విద్యాశాఖ అధికారి పివి రమణయ్య, కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య, మండలంలోని జడ్పీహెచ్ఎస్ పెదపట్టపాలెం ప్రధానోపాధ్యాయులు ఎస్ కే సలీబాషా, జడ్పీహెచ్ఎస్ భీమవరం ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు, ఎమ్మార్వో విజయభాస్కర్, బ్యాంక్ ఆఫ్ బరోడా కందుకూరు బ్రాంచ్ మేనేజర్ మధు, ఒంగోలు ట్రెజరీ ఆఫీసర్ కొండలరావు, బిటిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లగుంట మోహన్‌రావు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎస్కే అబ్దుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడికొండ భాస్కరరావు, దార్ల కోటేశ్వరరావులు విచ్చేశారు. వక్తలు ధర్నాస్ శోభన్ బాబు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అంబేద్కర్ గా మంచి స్నేహశీలిగా కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా నిర్వహించి చిన్న వయసులోనే మనకు జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోవడం విషాదకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయునిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జడ్పీహెచ్ఎస్ భీమవరం హెచ్ఎంగా పనిచేసిన కాలంలో పాఠశాల అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారని, ఆ సందర్భంగా పాఠశాలకు ఏ గవర్నమెంట్ పాఠశాలకు లేని విధంగా ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయడంలో కృషి చేశారన్నారు. ఆ సమయంలోనే పాఠశాల చరిత్రలో అత్యధిక మార్కులు 566 సాధించడం జరిగిందన్నారు. భీమవరం పాఠశాల ప్రస్తుత రూపుకు శోభన్ బాబు ఎంతో కష్టించారని అతని సహచరుడు మేడికొండ భాస్కర్ పేర్కొన్నారు. సలీం భాషా మాట్లాడుతూ శోభన్‌బాబుతో కరేడు పాఠశాలలో కలిసి పని చేశానని, అతని నుండి చాలా విషయాల్లో స్ఫూర్తి పొందానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరేడు పాఠశాలలో పనిచేసిన బాబు సహచర బృందం అతని కుటుంబానికి భేటీ ద్వారా రూ.11 వేలు అందించడం జరిగింది. అలాగే బహుజన్ టీచర్స్ అసోసియేషన్ తరఫున కుటుంబ భరోసా కింద శోభన్ బాబు కుటుంబానికి ఒక లక్ష 14 రూపాయలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా, డివిజన్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నమ్మ, గెరా కోటేశ్వరి, రాధమ్మ, రాధ, ఇందిర మహిళా ఉపాధ్యాయులతో పాటు బిటిఏ ఉపాధ్యాయులు వి కోటేశ్వరరావు, కొండలరావు, సుదర్శ ప్రభాకర్‌రావు, భాస్కర్, ఆదాము వీరనారాయణ, డి కోటేశ్వరరావు, రాజా, ఓగిపోయిన శ్రీను, ఇతర ఉపాధ్యాయ సంఘం నాయకులు శోభన్ బాబు, కుటుంబ సభ్యులు, అభిమానులు అధికంగా పాల్గొన్నారు.

## 21వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదల సేవలో మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఒంగోలు నియోజకవర్గం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాలతో 21వ డివిజన్ ధారవారితోట, దేవుని చెరువు సచివాలయం పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పింఛన్ దారులకు జూన్ నెలకి సంబంధించిన పించన్ పంపిణీ చేశారు కార్యక్రమంలో క్లస్టర్ 6 ఇంచార్జి దాయినేని ధర్మ, డివిజన్ అధ్యక్షులు గొల్లపూడి బాబురావు, కన్వీనర్ కోటపాటి కాశీరావు, కో కన్వీనర్ యనమల సురేష్, బూత్ ఇంచార్జిలు పొన్నరసు మురళి, నాయబ్ రసూల్, గుంజి నరసింహారావు, టీడీపీ నాయకులు బొర్రా చంద్రశేఖర్ యాదవ్, రమేష్, సచివాలయం సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.

## పదిలో ప్రతిభా చూపిన విద్యార్థులకు సత్కారం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 1)



చిన్నగంజాం మండలంలోని సోపిరాల గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పదిలో ఉత్తమ ప్రతిభా చూపి మంచి మార్కులు సాధించిన గ్రామ విధ్యార్థులకు సోపిరాల ఎంప్లాయీస్ వెల్ పేర్ అసోషియేషన్ (సేవా) సభ్యులు నగదు ప్రోత్సాహకం అందజేశారు. గ్రామంలో పదివ తరగతిలో ప్రధమ స్థానం సాధించిన గోగన పవన్ శభరినాథ్, ద్వితీయ స్థానం సాధించిన బుర్రి నితీష్ సాయి, తృతీయ స్థానం సాధించిన నున్నాలక్ష్మి ప్రసన్న లను సేవా సభ్యులు విద్యార్థుల ఇంటికి పోయి కుటుంబ సభ్యుల సమక్షంలో వారిని సన్మానించి సేవా మెరిట్ స్కాలర్ షిప్ అవార్డ్ 2026 ను నగదు రూపం లో ప్రతి ఒక్కరికి రూ.5,116 రూపాయలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా గ్రూపు తరుపున గత సంవత్సరం నుండి ఈ మెరిట్ స్కాలర్ షిప్ అవార్డు ఇస్తున్నామని, భవిష్యత్‌లో ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయని సాంబశివరావు, తుమ్మలపెంట శ్రీనివాసరావు, కుర్రి వెంకట్రావు, సాయని శ్రీనివాసరావు, శిఖరం వెంకటేశ్వరరావు, నరహరి చంద్రశేఖర్, పర్వతరెడ్డి సరళ, పల్లపోలు హిమవంతేశ్వరి, గోగన నాగమల్లేశ్వరరావు, సిద్దం నాగమల్లేశ్వరరావు, తదితర సేవా సభ్యులు పాల్గొన్నారు.

## కరేడు గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 1)

కరేడు గ్రామానికి నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించాలని ఉద్దేశంతో 23 మంది పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ చేయడం అయినదని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి అన్నారు. మా కుమారుడు సాయి తేజరెడ్డి అమెరికాలో ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లి అక్కడే ఉద్యోగం సంపాదించుకొని 4 సంవత్సరాల తర్వాత గ్రామానికి రావడం జరిగిందన్నారు. ఆ సందర్భంగా గ్రామ పారిశుద్ధ్య కార్మికుల సేవలకు తగిన గౌరవాన్ని అందించాలని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమం అనంతరం వారందరికీ భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ సందర్భంగా వారందరూ సాయి తేజేశ్వర్‌రెడ్డిని సన్మానించడం జరిగిందన్నారు. పెద్ద మనసుతో సన్మానించి దీవించిన వారందరికీ తేజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొంతమంది గ్రామస్తులు పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్‌కు ఒకే ఒక్క అర్జీ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 1)

ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా మండల రెవెన్యూ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించినట్లు మండల తహసీల్దార్ జె ప్రభాకర్‌రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలియజేశారు. సోమవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ నందు సబ్ డివిజన్ కోసం ఒకే ఒక్క అర్జీ అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె ప్రభాకరరావు, ఎంపిడిఓ కె ధనలక్ష్మి, ఎపిఎం సుబ్బారావు, ఎపిఓ లక్ష్మీ కుమారి, సర్వేయర్ సజ్జ లోకేష్, ఎవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్ బాబు





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 1)

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్ బాబు అన్నారు. పెద్దారవీడు మండలంలోని కలనూతల గ్రామంలో సోమవారం నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ ఇన్చార్జి ఎరిక్షన్ బాబు పాల్గొని వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఎన్టీఆర్ నూతన పింఛన్లను కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తెలుసుకొని ప్రభుత్వం వారి పై దృష్టి సాధించి ప్రత్యేకంగా వారికి రూ.3,000ల నుంచి రూ.4,000లకు పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వారికి పింఛన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతకే టిడిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం రూ.4 లక్షల నిధులతో గోకుల్ షెడ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో జాన్ సుందరం, ఇండ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర రోడ్డు రవాణా డైరెక్టర్ నక్క శ్రీను, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంకులో మహిళలకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేయాలని వినతి

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూన్ 1)

పుల్లలచెరువు మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖలో మహిళలు, పురుషులు ఒకే క్యూలో నిలబడి బ్యాంకింగ్ సేవలు పొందడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రజలు సోమవారం బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యాంకులో నగదు జమ, నగదు ఉపసంహరణ, ఇతర సేవల కోసం ప్రతిరోజూ అధిక సంఖ్యలో ఖాతాదారులు వస్తుండటంతో మహిళలు, వృద్ధులు అసౌకర్యానికి గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మహిళలకు ప్రత్యేక క్యూ లేదా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైతే టోకెన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బ్యాంకు సేవలను మరింత సౌకర్యవంతంగా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

# మలేరియా రహిత జిల్లానే లక్ష్యంగా పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 1)**

మలేరియా రహిత జిల్లా నే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం 'మలేరియా వ్యతిరేక మాసోత్సవాల పోస్టర్' ను అధికారులతో కలసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నెలరోజుల పాటు అన్ని శాఖల సహకారంతో దోమలు కుట్టకుండా చేయవలసిన కార్యక్రమాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో ముందుగానే స్ప్రేయింగ్ చేయించాలన్నారు. దోమల వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తొట్లు, డ్రమ్ములు, గంగాలా ల్లో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. గత సంవత్సరం మలేరియా కేసులు నమోదైన ప్రాంతాలైన దోర్నాల మండలం పెద్ద చామ, చిన్నారుట్ల, కత్రప్రోలు గ్రామాల్లో దోమల నివారణకు రెండు దశల్లో స్ప్రేయింగ్ చేయనున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఎంహెచ్ఓ కే రాహుల్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి శీనయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఈ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్వింటాకు పొగాకు రూ.36 వేలకు కొనుగోలు చేయాలి





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 1)**

క్వింటా పొగాకు రూ.36 వేల రూపాయలు ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని సోమవారం మండలంలోని పొగాక రైతులు గుంటూరులో నిర్వహించిన రాయబారం కార్యక్రమానికి మండలములోని రైతులు ర్యాలీగా బయలుదేరు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్జీనియా పొగాకు కొనుగోలుకు రూ 500 కోట్ల కేటాయించాలని, సమైక్య ఎస్ టి సి, పొగాకు బోర్డు ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కంటూ గోపి, పల్లపోతు సురేంద్ర, కుంకు సురేష్ బాబు, అనుమోలు సురేష్, నేలపాటి మాధవరావు, కల్లూరు చెంచురామయ్య, కంచర్ల రామ్ కుమార్, నరాల మోహన్, నాదెళ్ల మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నేతలే గంజాయి వ్యాపారులు

**యువతను మత్తుకు బానిసలుగా మార్చింది వాళ్లే**
**గంజాయి అమ్మకాలను అరికట్టాలన్నదే మీూా ఆశయం**
**పోలీసులకు ఇంటూరి స్పష్టమైన ఆదేశాలిచ్చారు**
**పాలనలో విచ్చలవిడిగా గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా**
**అప్పటి దోపిడీ గురించి ప్రజలకు బాగా తెలుసు**
**అభివృద్ధి, శాంతి భద్రతల పైనే మా ఎమ్మెల్యే దృష్టి**
**మీడియా సమావేశంలో వాస్తవాలు వివరించిన టీడీపీ నేతలు**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 1)**

మా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అవినీతి, అక్రమాలను అస్సలు సహించరు. సొంత పార్టీ నేతలు తప్పు చేసినా ఒప్పుకోరు. ఈ రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో ముఖ్యంగా కందుకూరు పట్టణంలో శాంతిభద్రతలు ఎలా అదుపులో ఉన్నాయో అందరూ చూస్తున్నారు. పట్టణాన్ని, గ్రామాలను నాగేశ్వరరావు ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు. అలాంటిది ఆయన పైన, ఆధారాలు లేకుండా బురద జల్లటం సరికాదని తెలుగుదేశం పార్టీ నేతలు స్పష్టం చేశారు. కందుకూరు లోని టిడిపి కార్యాలయంలో సోమవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో గంజాయి, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా గురించి రాసినవన్నీ అవాస్తవాలు అన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అలాంటి అక్రమాలన్నీ విచ్చలవిడిగా జరిగాయి తప్ప, కూటమి ప్రభుత్వంలో వాటికి చోటు లేదన్నారు. ముఖ్యంగా తమ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కు పాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో పలుకూరు దగ్గర భారీ స్థాయిలో గంజాయి పట్టుబడ్డ విషయాన్ని నేతలు ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ ఆ వ్యవహారంలో స్థానిక వైసీపీ నేతల ప్రమేయం ఉన్నప్పటికీ, వారి పేర్లు బయటకు రాకుండా ఎవరు కథనడిపారో అందరికీ తెలుసన్నారు. పట్టణంలో వైసీపీ నేతలు గంజాయి వ్యాపారులుగా మారి, యువతను మత్తుకు బానిసలుగా మార్చి, వారి జీవితాలను నాశనం చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎవరైనా గంజాయి వ్యాపారం చేస్తే వారి పై నిఘాపెట్టి కఠిన చర్యలు తీసుకునే విధంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు పోలీసులకు ఆదేశాలు ఇచ్చారని నేతలు తెలిపారు. అలాంటి వారు ఏ పార్టీవారైనా ఉపేక్షించవద్దని స్వయంగా ఎస్పీకి చెప్పారన్నారు. అలాంటి తమ నాయకుడి పై వాస్తవాలు తెలుసుకోకుండా కథనాలు రాయడం తగదన్నారు. ఇక జగన్ పాలనలో స్థానిక వైసిపి నేతలు చేసిన గ్రావెల్ స్కాం గురించి ఎవరిని అడిగినా చెబుతారని టిడిపి నేతలు పేర్కొన్నారు. జగనన్న లేఅవుట్లకు గ్రావెల్ తోలకం పేరుతో కోట్ల రూపాయలు దోచుకుని దాచుకున్నారని విమర్శించారు. ఓగూరులో వైసిపి మాజీ జెడ్పిటిసి భర్త, గ్రావెల్ దందా చేశారని చెప్పారు. బహిరంగంగానే అప్పటి ఎమ్మెల్యే పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని అన్నారు. వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఇలా అనేక గ్రామాల్లో గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున జరిగిందన్నారు. తమ ప్రభుత్వంలో రైతులు సొంతగా పొలాలకు తోలుకుంటున్నారే తప్ప, అక్రమాలు లేనేలేవన్నారు. తమ ప్రభుత్వం ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. ఐదారేళ్లక్రితం జరిగిన గ్రావెల్ అక్రమ రవాణా ఫోటోలను బయటకు తీసి, సాక్షి పత్రికలో ఇప్పుడు ప్రచురించారని నేతలు వివరించారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెల్లినా, ఏ వీధికి వెళ్ళినా ఇంటూరి మార్క్ పాలనను చూడవచ్చని టిడిపి నేతలు అన్నారు. ఇలాంటి అసత్య కథనాలు ఎన్ని రాసినా ప్రజలు నమ్మరన్నారు. గంజాయి అమ్మకాలపై ఏదైనా సమాచారం ఉంటే ఎమ్మెల్యేకి తెలియచేయవచ్చని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంటనే పోలీసులకు తగు ఆదేశాలు ఇస్తారని టిడిపి నేతలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్, క్లస్టర్ ఇంచార్జి వడ్డేళ్ల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.




# కేజిబివి ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగాలి

**కేజీబీవీ ఎస్టీయూ స్టేట్ ప్రెసిడెంట్ రత్నమాలిని దేవి డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 1)**

కేజీబీవీ విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల పట్ల అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ దాసరి అనిల్ కుమార్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని కేజీబీవీ ఎస్టియు ఏపి ప్రెసిడెంట్ రత్నమాలిని దేవి ఆరోపించారు. కేజీబీవీ సిబ్బంది సమస్యల పై జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన అనంతరం మల్లయ్య లింగం భవనంలో జరిగిన సమావేశంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులతో సమానంగా విద్యను అభ్యసించి నాలుగు వేల దగ్గర నుండి పాతిక వేల రూపాయల వరకు కట్టు బానిసల్లా ఉద్యోగాల్లో నెట్టుకొస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏ మాత్రం తీసిపోని విధంగా కష్టపడుతూ కేజీబీవీ ఉత్తీర్ణత శాతాన్ని 80 శాతానికి పెంచామని అన్నారు. చాలీచాలని జీతంతో మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తున్నామని, అటువంటి కేజీబీవీ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం,



అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలియజేశారు. ఎన్నో ఏళ్ల నుండి తమ సమస్యల కోసం పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒక ఎత్తు అయితే ఇటీవల ట్రాన్స్ఫర్‌ల పేరుతో సిబ్బందిని వేధిస్తున్నారని, బదిలీలకు సంబంధించిన విధి, విధానాలను ఏమాత్రం పట్టించుకోకుండా వాట్సప్ సందేశాల ద్వారా ట్రాన్స్ఫర్లు చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఏపిసి తనకు నచ్చిన వారికి నచ్చిన ప్లేస్‌లో బదిలీ చేస్తూ ఇతరులను ఇష్టారీతిన బదిలీ చేస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం నాలుగు ప్లేసుల్లో స్టేటస్కో ఉన్న ఆ ఆర్డర్ను బాహాటంగానే ధిక్కరిస్తూ లిఖితపూర్వకంగా జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. నాలుగు ప్లేసుల్లో హైకోర్టు ఆర్డర్ ఉండగా హైకోర్టు ఆర్డర్ కూడా ధిక్కరిస్తూ వ్యవహరిస్తున్నారని తెలియజేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాల సరస్వతి, మాలతి, రత్నకుమారి, మాధురి, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో జరిగే మెగా పాటల పోటీలను జయప్రదం చేయండి

**కళా పరిషత్ అధ్యక్షులు పఠాన్ జాన్ ఖాన్**



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 1)**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గాన గంధర్వులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్ మాచర్ల వారి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన మాచర్ల పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో సాయంత్రం 7 గంటలకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని కళా పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ జాన్ ఖాన్, మాగులూరి రాంబాబులు తెలిపారు. సోమవారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ముటుకుల కమలహాసన్ రావు మాట్లాడుతూ మాచర్లలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మనిషి దైనందిన జీవితంలో అలసిన మనసుకు సంగీతం ఎంతో హాయినిస్తుందని అన్నారు. కళాపరిషత్ అధ్యక్షులు పఠాన్ జాన్ ఖాన్ మాట్లాడుతూ ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.12000లు, ద్వితీయ బహుమతి రూ.8000లు, తృతీయ బహుమతి రూ.5000లు, 5 కన్సోలేషన్ బహుమతులు ఒక్కొక్కరికి రూ.1000ల చొప్పున అదేవిధంగా ఎంపికైన మిగిలిన అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన అభ్యర్థులు జూన్ 7వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఎంపిక ప్రక్రియకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ జాన్‌ఖాన్ 9573786029, మాగులూరి రాంబాబు 9505453457 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కాశిబోయిన శివశంకర్, కార్యవర్గ సభ్యులు బాహాటం శేషగిరి రాజు, ఓరుగంటి చెన్నకేశవరావు, ఇల్లూరి పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com